# సింగిల్ పేజీ కథలు

## కొత్త స్వామీజీ

"అమ్మా... స్కూలుకి టైమవుతోంది తొందరగా టిఫిన్ తయారుచేయవే" నాలుగో తరగతి చదువుతున్న అప్పూ అమ్మను తొందర పెడుతున్నాడు.

"ఆ.. చేస్తా.. చేస్తా ఎందుకు తయారుచేయనూ. మీ అయ్య సంపాదించిన సంపాదనంతా ఎలా ఖర్చవుతుంది మరి?" విసుక్కుంది.

"అమ్మా! ఇవాళ టిఫిన్ ఏం చేస్తున్నావ్?" ఐదేళ్ల గారాలు అడిగింది.

"ఉప్మా.." పళ్లు బిగపట్టి గట్టిగా అరిచింది సరోజ.

"ఉప్మా వద్దు. ఇడ్లీ చేయ్"

"ఇడ్లీ వద్దు. ఉప్మా కావాలి"

"కాదు...ఇడ్లీ"

"కాదు...ఉప్మా"

అప్పూ, గారాలు ఇద్దరూ కొట్టుకుంటున్నారు. అసలే విసుక్కుంటున్న సరోజ వీళ్ల కొట్లాటకు మరింత చిరాకు తెచ్చుకుంది.

"ఆపండిరా మీ గోల" వంటగది నుంచి పరిగెత్తుకొచ్చి గట్టిగా అరిచింది. పిల్లలు ఠక్కున నోరు మూసుకున్నారు.

"ఇడ్లీ లేదు ఉప్మా లేదు. మీ నాన్న కొంప వదిలి ఎక్కడ తగలడ్డారో తెలియక నేను తిప్పలు పడుతుంటే మధ్యలో మీ అల్లరేంటి?" కసురుకుంది.

"అమ్మాయీ! సరోజా" అని గుమ్మంలోంచి ఎవరో పిల వగానే సడన్‌గా అటు చూసింది.

"వచ్చాడటే మీ ఆయన?" లోపలకు వస్తూ అడిగింది శారద.

"ఇంకా రాలేదు పిన్నీ. ఇవాల్టికి నాలుగు రోజులు ఇల్లు విడిచి పెట్టి ఎక్కడికెళ్లారో ఏమైపోయారో ఏమీ పాలుపో వడం లేదు" కళ్లలో నీళ్లు పెట్టుకుంది.

"పీడికి ఇదేం పోయే కాలమే.. నువ్వు దిగులు పడ మాక. ఊళ్లోకి ఒక స్వాముల వారు వచ్చారు. ఆయన జరిగిన విషయాలూ, జరుగుతున్న విషయాలూ, జరగబోయే విష యాలు కూడా చెప్తున్నారు. మనం వెళ్లి మన చేయి చూపిస్తే చాలు అన్నీ ఇట్టే చెప్పేస్తున్నారు. ఊరి జనం ఆయన దగ్గ రకు వెళ్లి పూజలు చేయటం, కానుకలివ్వటం.. ఒకటేమిటి అయన్ని దైవ సమానంగా కొలుస్తున్నారు"

"అంత గొప్ప స్వాములవారా! మరీ విషయం ఇప్పటి దాకా నాకు తెలియలేదేమిటి?" ఆశ్చర్యపోయింది సరోజ.

"నువ్వు మీ ఆయన పోయాడన్న బాధలోనే ఉన్నావు గానీ బయటికొచ్చి ఒక్కసారైనా లోకాన్ని చూశావా?"

"అయితే మనం ఇప్పుడే వెళ్లి స్వాముల వారిని కలుద్దాం పిన్నీ"

"అలాగే కలుద్దాంలే గానీ ఇంట్లో పంచదార నిండు కుంది. ఉంటే ఓ కప్పు పంచదార బదులివ్వమ్మా"

'అదన్న మాట అసలు సంగతి' మనసులో అనుకుంది.

"ఓ...దానికేం భాగ్యం పిన్నీ. ఇప్పుడే ఇస్తానండి" అని వంటగదిలోకెళ్లింది సరోజ.

* * *

ప్రత్యేకంగా తనకు కేటాయించిన గదిలో దేవుని విగ్రహం ముందు కూర్చుని ఏవో మంత్రాలు చదువుతూ పూజ చేస్తున్నారు స్వాముల వారు.

ఒక యువకుడు పూజ గదిలోకి వచ్చాడు.

"నమస్కారం స్వామీజీ" రెండు చేతులు జోడించి నమ స్కరించాడు. మంత్రోచ్ఛారణ ఆపి అతని వైపు చూశాడు స్వామీజీ.

"స్వామీ నాదో సమస్య"

"అపరా బుడతా...నీ సమస్య నాకు తెలుసురా"

"అదెలా స్వామీ.. కనీసం నా చెయ్యి కూడా చూడకుం డానే.." ఆశ్చర్యంగా అడిగాడతను.

"ఎదురు ప్రశ్నలు వేయకురా. ఈ స్వాముల వారికి భూత భవిష్యత్ వర్తమానాలు చెప్పటానికి చెయ్యే చూడక్క రలేదురా. ముఖము చూసిననూ చాలు. నువ్వొక అమ్మా యిని ప్రేమిస్తున్నావు. కానీ ఆ అమ్మాయి మాత్రం నీ వంకైనా చూడటం లేదు. ఆ పిల్ల నీ వశం కావాలి. అంతేగా? సరే. నీ సమస్యకు పరిష్కారం చెబుతా విను" అంటూ కుంకుమ రాశిలోంచి ఒక తాయెత్తు తీశాడు.

"దీని పేరు దశదిన ముక్తి తాయెత్తు. దీనిని నీ ప్రేయసి చేతికి కట్టగలిగితే పది రోజుల తర్వాత ఆమె నీ వశమవు తుంది. దీని ఖరీదు రెండు వందలు. లక్ష్మిని నాకు ఇచ్చి తాయెత్తును నువ్వు తీసుకెళ్లొచ్చు."

"లక్ష్మి నా ప్రేయసి. మీకెలా ఇవ్వమంటారు స్వామీ" ఆందోళనగా అడిగాడు.

"మూర్ఖుడా! నేనడిగింది డబ్బు నీ ప్రేయసిని కాదు. లక్ష్మి అనగా మా దైవభాషలో డబ్బు అని అర్థం. ఇది కూడా తెలియకపోతే నీ బ్రతుకు వ్యర్థం."

"తప్పయింది స్వామీ. నన్ను శపించకండి" అంటూ జేబులోంచి రెండు వందలు తీసిచ్చి, తాయెత్తు పట్టుకెళ్లాడా యువకుడు.అతను వెళ్లగానే లోపలకు సరోజ వచ్చింది. వచ్చీ రాగానే "స్వామీ" అంటూ ఏడ్వసాగింది.

"ఇక్కడ ఆడదాని ఏడుపు కూడదు. అది ఈ ఊరికే అరిష్టం." గర్జించాడు స్వామి.

ఠక్కున ఏడుపు ఆపింది సరోజ.

"స్వామీ.. మా ఆయన..." ఆవిడ మాటలు పూర్తికాకుం డానే మధ్యలోనే అడ్డుకున్నాడు స్వామి.

"ఇల్లు విడిచి వెళ్లాడు. ఎక్కడికి వెళ్లాడో తెలియదు. ఎప్పుడు వస్తాడో తెలియదు. అదేగా నీ సమస్య?"

"అవును స్వామీ ఎంత బాగా చెప్పారు"

"కైలాసగిరి మీద శివుని పాదాల కింద వేయి సంవత్స రాలు శిష్యరికం చేసినవాడను. ఆమాత్రం జాతకం చెప్పలేక పోతే నా సుదీర్ఘ శిష్యరికానికి అర్థం ఉండదు. నీ సమస్యకు పరిష్కారం కావాలంటే ముడుపులు ముట్టచెప్పాలే బేలా"

"ముడుపులా..నా వల్ల కాదు స్వామీ"

"ముడుపు లేనిదే ముక్తే లేదు" తేల్చి చెప్పాడు స్వామి.

'శారద పిన్నిని సాయమడిగితే పోలా.. మళ్లీ మా ఆయన రాగానే ఆవిడ బాకీ తీర్చేయొచ్చు' అనుకుందిమన సులో.

"నీ ఆలోచన సరియైనదేనే బాలా. మీ ఆయన తిరిగిరా గానే ఆవిడ బాకీ తీర్చేయొచ్చు"

అతని దివ్యజ్ఞానానికి అదిరిపడింది సరోజ.

"నా గదిలోకి వచ్చిన వారి ఆలోచనలు కూడా నేను తెలు సుకోగలను. నువ్వు మీ శారద పిన్ని వద్ద అప్పు చేసి సాయం సమయాన వేయి రూపాయలు తీసుకురా. మీ ఆయన మీద ఒక గ్రహం ప్రభావం చూపుతోంది. మూడు దినముల తర్వాత గృహమును చేరతాడు. ఇక నువ్వు వెళ్లొచ్చు"

ఆనందంగా వెనుదిరిగింది.

* * *

స్వాముల వారు చెప్పినట్లే మూడు రోజుల తర్వాత ఇంటికి వచ్చాడు సరోజ భర్త శ్రీనివాసరావు. బ్యాగు నిండా డబ్బులు కూడా తీసుకొచ్చాడు.

"ఇంత డబ్బెక్కడిదండి?" ఆశ్చర్యంగా అడిగింది సరోజ.

"పిచ్చి మొహమా నువ్వు నన్ను గుర్తుపట్టలేక పోయావు. ఊళ్లో స్వామీజీ అవతారం ఎత్తింది నేనే" స్వామీజీ అంత ఖచ్చితంగా జాతకాలు ఎలా చెప్పగలిగాడో సరోజకు ఇప్పుడర్థమైంది.

**-ఎ.కొండలు (అద్దూరు)**

***

## పోయిరా మాతల్లి.. పోయి రావమ్మా

తొమ్మిది గంటలయిపోయింది. గంట ముందు బయలుదేరితే కానీ రెండు బస్సులు మారి టైముకి ఆఫీ సుకి చేరుకోలేడు రమేష్. కొందరిలా ఎప్పుడెళితే ఏంలే మన జీతం మనకి నెలయ్యేటప్పటికి ఠంచనుగా వస్తుందిలే అను కొనే రకం కాదు. పై సంపాదనకాశపడే రకమూ కాదు. పదో గంటయ్యేటప్పటికి సీటులో ఉండాలి, తన పని తాను సిన్సి యర్‌గా చెయ్యాలి అనే తత్వం రమేష్‌ది. అందుకే ఆ హడా విడి. భార్య అందించిన భోజనం కేరియర్ పట్టుకుని మెట్లు దిగబోతుంటే-

"ఏమండీ" అని గోముగా పిలిచింది భార్య శ్యామల.

ఏమిటీ అన్నట్టు చూశాడు రమేష్.

"ఈ రోజు మీ ఎరియర్స్ వస్తాయన్నారు కదా" నానుస్తు న్నది శ్యామల.

"చెప్పు శ్యామలా నాకవతల బస్సు తప్పిపోతుంది"

వినుక్కొన్నాడు రమేష్.

"ఏం లేదండీ. ఎన్నాళ్ల బట్టో టీవీ కొనుక్కుందామని అడుగుతూ ఉంటే మీరేం మాట్లాడటం లేదు. మీకేం ఉదయం వెళ్లిపోయి రాత్రికి వస్తారు. నాకింట్లో ఏం తోస్తుంది చెప్పండి. పిల్లలైనా ఉంటారేమో అంటే వాళ్లు స్కూలుకెళ్లి పోయి సాయంకాలం దాకా రారు. ఎంతకని ఇరుగు పొరుగు ఇళ్లకెళ్లి టీవీ చూస్తాను. కూలి చేసుకొని బ్రతికేవాళ్ల ఇళ్లల్లో కూడా ఈ కాలంలో టీవీ ఉంటోంది. 'మీ ఇంట్లో టీవీ లేదు' అని ఎవరైనా అడిగితే సమాధానం చెప్పడానికే నాకు సిగ్గువేస్తోంది. ఈ రోజు ఆ ఎరియర్స్‌తో టీవీ కొనుక్కు రండీ" అంది ప్రాధేయంగా.

రమేష్ బస్సులో కూర్చున్నాడే కానీ భార్య కోరికే మన సులో మెదులుతూ ఉంది. తానేం టీవీ కొనలేని దీనస్థితిలో లేడు. కానీ ఎం.ఆర్.ఒ. ఆఫీసులో గుమస్తాగా చేసే తను తన ఇద్దరి పిల్లలని తనలా గుమస్తాలాగా తయారుచేయకుండా వాళ్ల భవిష్యత్తుని తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో తలకు మించిన భారంతో ఇద్దరిని ఫీజులెక్కువని ఆలోచించకుండా మంచి కాన్వెంటులో చేర్పించాడు. తాను ఖర్చులని కుదించు కుంటూ పైన పైన పిల్లల పై చదువుల కోసం పొదుపు చేసు కొంటున్నాడు. వాళ్లు తొంభై, తొంభై ఐదులు మార్కులతో ప్రోగ్రెస్ రిపోర్టులు తీసుకొచ్చినప్పుడు గర్వంతో పొంగిపోతు న్నాడు. ఈ విషయం శ్యామలకే తెలుసు. అయినా ఏ కోరి కలూ కోరని శ్యామల ఎన్నాళ్ల బట్టో టీవీ కొనమంటోంది. చూద్దాం పర్యవసానంగా అనుకున్నాడు రమేష్.

ఆ సాయంకాలమే టీవీ ఇల్లు చేరింది. శ్యామల సంతోషం అంతా ఇంతా కాదు. ఇరుగు పొరుగు అందరికీ చూపించింది. కాఫీలు కూడా సప్లై చేసింది. పిల్లలు ముచ్చ టపడ్డారు.ఇంక శ్యామలకి ఆ రోజు నుంచి కాలక్షేపానికి కొదు వలేదు. ఏ సీరియల్నీ వదలడం లేదు. తెలుగే కాకుండా తమిళ వెర్షన్సు కూడా చూస్తోంది. ఎడ్వర్‌టైజ్‌మెంట్లు వచ్చిన ప్పుడు పనిచేసుకొంటోంది. ఏ లోటూ ఇంట్లో వాళ్లకి రాకుండా మేనేజ్ చేస్తోంది.రమణ, వినయ్‌కి కూడా హోంవర్కు చేసు కుందామని గదిలో కూర్చున్నా దృష్టి మాత్రం టీవీ మీదే ఉంటోంది. ఏ సీరియల్ ఏ టైముకొస్తుందో వాళ్లని కరకరామ లకమే. పైగా ఏడయింది. హోంవర్కు చెయ్యండర్రా అంటే ఈ సీరియల్ అయిపోతేనే కానీ ఏడయినట్టు కాదమ్మా అంటున్నారు.

మూడు నెలలు ఇట్టే గడిచిపోయాయి.

ఆదివారం..

రమేష్ తీరుబడిగా పేపరు పట్టుకొని వాలుకుర్చీలో కూర్చున్నాడు. రమ, వినయ్ బిక్కమొగాలేసుకొని ప్రోగ్రెస్ రిపోర్టులు చేతిలో పట్టుకొని సంతకం కోసం తండ్రి దగ్గర నిల బడ్డారు.వాళ్ల చేతిలోంచి తీసుకున్న ప్రోగ్రెస్ రిపోర్టులు చూసే టప్పటికి షాకయిపోయాడు రమేష్. ఇద్దరికీ ఏ సబ్జెక్టుల లోను నలభై దాటలేదు. ఉదయం వెళ్లిపోయి రాత్రికే ఇల్లు చేరే రమేష్ భార్య పర్యవేక్షణలో పిల్లలు బాగా చదువుకొంటు న్నారని వాళ్ల మీద దృష్టిపెట్టలేదు. ఇప్పుడే రిపోర్టులు చూస్తే పరిస్థితి అర్థమయింది.

"శ్యామలా.." వంటింట్లోకి వినిపించేటట్టు ఒక్క గావుకేక పెట్టాడు రమేష్. అప్పటికే ప్రోగ్రెస్ రిపోర్టులు చూసి అవాక్క యిన శ్యామల భర్త నోరు తెరవకుండానే "టీవీని రేపే ఎవరి కైనా అమ్మేద్దామండీ" అంది బేలగా.

**-వి.సత్యవతీదేవి (గుమ్మలక్ష్మీపురం)**

***

# ఎస్.ఎమ్.ఎస్.సుజాత

ఆఫీసు నుంచి వచ్చిన కరుణాకర్ సోఫాలో కూల బడి, షూస్ విప్పుతూ "సుజీ కొంచెం మంచినీళ్లు ఇయ్యి" అన్నాడు.

టీవీలో 'అంత మాయే' ప్రోగ్రామ్ చూస్తూ వాళ్లు అడిగిన ప్రేక్షకుల ప్రశ్నకి సమాధానం ఎస్.ఎమ్.ఎస్. చేస్తూ దీక్షగా ఉన్న సుజాత భర్త అడిగినది వినిపించుకో లేదు.దాంతో కోపం వచ్చిన కరుణాకర్ గట్టిగా "సుజీ" అని అరిచాడు."అబ్బా! ఏమిటండి అంతలా అరిచారు" అంది ఉలిక్కిపడి.

"ఏం చేయను.. ఛావనా ఎంత పిలిచినా నువ్వు పల క్కుండా, ఆ ఫోన్‌తో కూర్చుని నా ప్రాణం తీస్తోంటే" అన్నాడు అసహనంగా.

"అబ్బబ్బ, ఎప్పుడూ నా ఫోన్ గురించి గోలేనా"

"గోల గోలేమిటే నువ్వే అస్తమానూ ఆ ఫోన్ రిమోట్ పుచ్చుకుని ఎప్పుడు చూసినా ఆ టీవీ ముందు కూర్చుని మా అందరిని విసిగిస్తున్నావ్"

"ఆ.. అదే ఏడుపు, ఇంతకీ ఏమిటి మీ గోలకి కారణం"

"కాసిని మంచి నీళ్లు మొహాన కొడితే సంతోషిస్తా"

"ఆ కొడతాలెండి?" అంటూ కిచెన్‌లోకి వెళ్లింది, కోపంగా సుజీ!మంచి నీళ్లతో పాటు ఒక ప్లేటులో పకో డీలు, టీ కూడా తెచ్చేసింది. ఏకంగా!

"అబ్బా పకోడీలు చేయటానికి కూడా నీకు తీరిక దొరి కిందే" అన్నాడు నీళ్లు తాగి గ్లాసు పక్కన ఉంచి.

"ఆ సంబరం" అంటూ తిరిగి టీవీ ముందు చతికిల బడింది.పకోడీ ఒకటి తీసి నోట్లో వేసుకుని "ఛీ ఛీ ఎప్పుడు చేశావ్ ఈ పకోడీలు, లేక ఫ్రిజ్‌లో ఉంచావా ఇంత చల్లగా చచ్చాయి" అన్నాడు!

"ఆ మరే నిన్న చేశాను" అంది తలతిప్పకుండానే!

"నీ పిచ్చితగలెయ్యా ఇంట్లో వంట కూడా సరిగా చేయవా ఏమిటే, నీ టీవీ ప్రోగ్రామ్సు కాదుకానీ చచ్చేచావ యింది కదే. ఒక పక్క ఫోన్ బిల్లు అదిరిపోతోంది. ఒక పక్క నీ గోల, అబ్బబ్బ, ఏం టీవీ ప్రోగ్రామ్స్‌రా బాబు" అని విసుక్కుంటూ టీ తాగి వెళ్లిపోయాడు.

"ఏం టిఫిన్ తినలేదా" అంది మధ్యలో ప్రకటనలు వచ్చినపుడు తల తిప్పి చూసిన సుజాత.

"ఆ అని నువ్వే తిను కాలక్షేపంగా ఉంటుంది" అంటూ లోపలకు వెళ్లబోతూ.

"వంట చేశావా అది కూడా లేదా పిల్లలు వచ్చే సమయం అయింది" అన్నాడు.

"అయిందిలెండి మీరేం గాబరా పడక్కర్లా. మధ్యలో ప్రకటనలు వచ్చినపుడు లేచి కుక్కర్ పెట్టేశాను!" అంది.

ఆ రోజు రాత్రి "సుజా మా అమ్మని రమ్మని ఫోన్ చేస్తాను" అన్నాడు.

"ఇప్పుడు ఎందుకు"

"అదే నీకు టీవీ మీద ధ్యాసతోనే సరిపోతోంది కదా. పిల్లల్ని చూడు పాపం సరయిన తిండి వేళకు లేక ఎలా పాడయిపోతున్నారో మార్కులు కూడా చాలా తక్కువ వస్తున్నాయి ఈమధ్య. అమ్మ వస్తే కనీసం కడుపు నిండా తిండయినా తింటారు" అన్నాడు.

"ఆవిడ వస్తే చేస్తుందనా మీ ఆలోచన. మీకు తోడు ఆవిడ కూడా సతాయిస్తుంది నన్ను"

"అదేం లేదులే. నీ టీవీకి అడ్డురాదు" అన్నాడు!

"అయితే సరే! నాకు మరీ అటూ ఇటూ పరుగులు పెట్టినట్లుగా ఉంటోంది. రమ్మనండి" అంది ముసుగువే సేసి."ఓసీ నీ ఇల్లు బంగారం కాను" అన్నాడు పడు కుంటూ."బాగా గుర్తు చేశారు. ఈ ప్రోగ్రామ్, రేపు 'డి' చానల్‌లో ఉందండి" అంది సగం నిద్రలోనే.

'హతోస్మి' అనుకుంటూ తాను కూడా నిద్రలోకి జారాడు.రెండు రోజుల అనంతరం, సుజాత అత్తగారు దిగింది.వచ్చిన రోజు బాగోదని సుజాత వంట చేసింది. అత్తగారు టీవీ చూస్తూ హాయిగా కాలక్షేపం చేసింది.

మరునాటి నుంచి ఒకో పని మెల్లిగా అత్తగార్కి షిఫ్టు చేసేసింది. టీవీ చూడటానికి లేకుండా పోయిందని అత్త గారు అనసూయమ్మ విసుక్కోసాగింది.

ఒకరి తరువాత ఒకరు ఫిర్యాదులు చేయసాగారు కరుణాకర్‌కి.ఇదో లేనిపోని తలనెప్పి అయింది కరుణాక రానికి. ఎవరినీ ఏమీ అనలేడు.

"అమ్మా నువ్వు ఖాళీ సమయాల్లో రేడియో వినవే. అందులో మంచి ప్రోగ్రామ్సు వస్తాయి" అన్నాడు రాజీగా!

ఇప్పుడు ఆవిడ రేడియో వినసాగింది. రేడియోలో కూడా ఇప్పుడు ఎస్.ఎమ్.ఎస్.ల ద్వారా బహుమతులు ప్రారంభం అయ్యాయి. దాంతో ఆవిడ కూడా మనవలని అడిగి ఎస్.ఎం.ఎస్.లు ఎలా ఇవ్వాలో నేర్చుకుని ఆ పనిలో పడింది.ఇప్పుడు కరుణాకర్ పని కుడితిలో పడ్డట్టు అయింది. రెండు ఫోన్‌లు చెరొకళ్లు పట్టుకుని బిజీగా ఉన్నారు.కరుణాకరం బాధ అర్థం అయినట్లుగా టీవీ కాస్తా పాడయిపోయింది. అమ్మయ్య, ఓ ఆర్నెలలు బాగు చేయకపోతే సరి అనుకున్నాడు!

వారం అయ్యేసరికి ఇంటికి వచ్చినపుడల్లా సుజాత ఎవరింట్లో ఉందో వెతుక్కోవాల్సి వచ్చింది.

రోజుకో ఇంటికి వెళ్లి ప్రోగ్రామ్సు చూడటం ప్రారంభిం చింది. అత్తగారు కూడా ఇక్కడ నాకేం తోచటం లేదంటూ మరో కొడుకు దగ్గరకు పోయింది. దాంతో కరుణాకరం తాళం వేసిన ఇల్లు చూసి రోజా 'దీనికన్నా, అదే బెటరు' అనుకుని టీవీ రిపేరు చేయించాడు. తిరిగి సుజాత యధావిధిగా టీవీ ప్రోగ్రామ్సు చూడటంలో పడింది. ఎస్.ఎమ్.ఎస్. సుజాత గారిల్లు అంటే, ఆ కాలనీలో ఎవ రయినా ఇట్టే చెబుతారు హేట్సాఫ్ టీవీ! అదండీ మరి కథ!

**-కాకరాల భానుమతి (హైదరాబాద్)**